సాక్షి నంద్యాల

ఆదివారం । 8 । జనవరి । 2023



ఇంటి వద్దకే వైద్యం

ఫ్యామిలీ ఫిజిషియన్ విధానంతో ఇంటి వద్దనే ప్రజలకు వైద్యం అందుతోందని కర్నూలు ఎంపీ సంజీవకుమార్ అన్నారు. మెడికల్ కాలేజీలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు.

IIలో



ఎల్లమ్మ హుండీ లెక్కింపు

కర్నూలు(న్యూటౌన్): కర్నూలు నగర శివారులోని వెంకాయపల్లె ఎల్లమ్మ దేవస్థానం హుండీ కానుకలు లెక్కించగా రూ. 11.11 లక్షల ఆదాయం వచ్చింది.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,623.18
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:70.702
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:000
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:8.439

న్యూస్‌రీల్

వైభవంగా ధనుర్మాస పూజలు



ప్రత్యేకాలంకరణలో గోదాదేవి అమ్మవారు

ఆళ్లగడ్డ: దిగువ అహోబిలంలో ధనుర్మాస పూజలు వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం ఉత్సవ మూర్తులైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరదస్వామితో పాటు గోదాదేవి అమ్మవారిని యాగశాలలో కొలువుంచారు. అనంతరం వేదపండితుల వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ కనులపండుగగా నవకళశ స్థాపన, పంచామృతాభిషేకం, తిరుమంజనం, అర్చన నిర్వహించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం ఉత్సవం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

యాగంటీశ్వరుడి సేవలో హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్



హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ లక్ష్మణరావుకు స్వామి చిత్ర పటం అందజేస్తున్న దృశ్యం

బనగానపల్లెరూరల్: యాగంటి క్షేత్రంలో వెలసిన శ్రీ ఉమామహేశ్వరస్వామి వారిని హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ జి.లక్ష్మణరావు శనివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ చైర్మన్ తోట బుచ్చిరెడ్డి, ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఏక శిలా రూపంలో కొలువైన శ్రీ శివ పార్వతులకు అభిషేకం, అర్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఆయనకు స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు. ఆయన వెంట బనగానపల్లె జూనియర్ సివిల్ జడ్జి కిశోర్‌కుమార్, ఎస్‌ఐ రామిరెడ్డి తదితరులు ఉన్నారు.

నేడు గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష

నంద్యాల(అర్బన్): జిల్లాలోని ఐదు పరీక్షా కేంద్రాల్లో ఆదివారం గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీఆర్‌ఓ పుల్లయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందు కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. పట్టణంలోని గుడ్‌షెప్పర్డ్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ (ఎన్‌జీఓ కాలనీ), నేషనల్ డిగ్రీ కళాశాల (శ్రీనివాసనగర్), ఎస్‌వీఆర్ ఇంజినీరింగ్ కాలేజీ (అయ్యలూరు మెట్ట), రాజీవ్ గాంధీ మెమోరియల్ కాలేజీ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (నెరవాడ క్రాస్ రోడ్డు), శాంతిరాం ఇంజినీరింగ్ కాలేజీ (నెరవాడ)లోని కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరీక్షలు ఉంటాయన్నారు.

కేసీ కెనాల్‌కు 458 క్యూసెక్కుల నీరు

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కెనాల్‌కు 458 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు డ్యాం అధికారులు శనివారం విలేకరులకు తెలిపారు. రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో నిలిచిపోయిందని, డ్యాంలో ప్రస్తుతం 0.782 టీఎంసీల నీరు నిల్వ ఉందని చెప్పారు.

శ్రీమఠానికి విరాళాల వెల్లువ

మంత్రాలయం: ప్రముఖ రాఘవేంద్రస్వామి మఠానికి భక్తుల నుంచి విరాళాలు వెల్లువలా వస్తున్నాయి. శనివారం వివిధ ప్రాంతాలకు చెందిన భక్తుల నుంచి రూ.3.16 లక్షల విరాళం వచ్చినట్లు మేనేజర్ శ్రీనివాసరావు వెల్లడించారు. హైదరాబాద్‌కు చెందిన ప్రభ అరవింద్ వెండి రథానికి రూ.లక్ష, బెంగళూరుకు చెందిన వెంకటేష్ ప్రభు అన్నదానానికి రూ.లక్ష, గోసంరక్షణకు రూ.50 వేలు, విద్యాదానానికి రూ.38 వేలు, బెంగళూరుకు వాసి శంకరానంద వెండిరథానికి రూ.25 వేలు అందజేసినట్లు తెలిపారు.

మది నిండుగా.. ఇంటి పండగ

సంక్రాంతిని తలపించిన టిడ్కో గృహాల పంపిణీ

- అక్కచెల్లెమ్మలు ఆనంద పరవశం
- సీఎం వైఎస్ జగన్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం
- హాజరైన మంత్రులు సురేష్, అంజాద్ బాషా, ప్రజా ప్రతినిధులు
- జగనన్న నగర్‌ను గ్రేటెడ్ కమ్యూనిటీగా తీర్చిదిద్దుతామని హామీ



మాట్లాడుతున్న మంత్రి సురేష్, చిత్రంలో డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిశోర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి

నంద్యాల(సిటీ): పేదల సొంతింటి కల నెరవేరిన వేళ సంతోషం వెల్లివిరిసింది. వారం ముందుగానే సంక్రాంతి పండుగ వచ్చిందా.. అనేటట్లుగా సంబరాలు చేసుకున్నారు. కలల గూడులోకి అడుగు పెట్టిన అక్కచెల్లెమ్మలు ఆనంద పరవశం చెందారు. జిల్లా కేంద్రం నంద్యాలలో శనివారం టిడ్కో గృహాల పంపిణీ కార్యక్రమాన్ని వేడుకలా నిర్వహించారు. కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అధ్యక్షతన ముఖ్య అతిథులుగా రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, డిప్యూటీ సీఎం, నంద్యాల జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అంజాద్ బాషా, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి తదితరులు జగనన్న నగర్‌లోని (ఎస్సార్బీసీ టిడ్కో) గృహాలను ప్రారంభించి, ఇంటి హక్కు పత్రాలను, ఇంటి తాళాలను లబ్ధిదారులకు అందజేశారు. ముందుగా అతిథులంతా జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులు గృహ ప్రవేశం చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారురాలు అఫ్రీన్ దంపతులకు మంత్రులు నూతన వస్త్రాలను అందించారు. ఆ ఇంట తేనేటి సేవించి వారితో కాసేపు ముచ్చటించారు. ఇంటికి యజమానులను చేసినందుకు మహిళలు అభిమానంతో టిడ్కో గృహాల వద్ద ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రులు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అర్హులందరికీ గృహాలు అందజేస్తున్న జగనన్న పాలనను కొనియాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, రాష్ట్రమార్క్‌ఫ్రెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి , జేసీ నిషాంతి, టిడ్కో చైర్మన్ జమ్మన ప్రసన్నకుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, వైస్ చైర్మన్‌లు గంగిశెట్టి శ్రీధర్, పామ్‌శావలి, 38వ వార్డు వైఎస్సార్ నగర్ వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ తూర్పునాటి సావిత్రమ్మ, వైఎస్సార్‌సీపీ ఇంచార్జ్ రమణ, ఆయా కార్పొరేషన్ల రాష్ట్ర డైరెక్టర్లు సునీత అమృతరాజ్, శశికళారెడ్డి, చంద్రశేఖర్, నాయకులు కల్లూరి రామలింగారెడ్డి, కమిషనర్ రవిచంద్రారెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.



సభకు హాజరైన లబ్ధిదారులు, స్థానిక నాయకులు

దేశానికే ఆదర్శం

- డిప్యూటీ సీఎం అంజాద్ బాషా

జగనన్న పాలన దేశానికే ఆదర్శం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఇంటి పెద్దగా ఉంటూ, అవ్వా తాతలకు మనవడుగా, అక్కా చెల్లెళ్లకు తోడబుట్టిన అన్నగా రాష్ట్ర ప్రజలందరి మనసులో తనదైన ముద్ర వేసుకున్నారు. నంద్యాల పట్టణంలో ఏకంగా ఉచిత 8,704 గృహాలను లబ్ధిదారులకు అందించడం హర్షించదగ్గ విషయం. పేదల సొంతింటి కలను నెరవేర్చుతూ ప్రతి ఒక్కరికీ ఇళ్లు అందించేందుకు కృషి చేస్తున్నాం. సంక్షేమ పథకాల అమలులో 98 శాతం హామీలు అమలు చేసిన ఏకైక నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. సంక్షేమ పథకాల కోసం క్యాలెండర్‌ను అమలు చేస్తూ ఆన్‌లైన్ పద్ధతిలో అర్హులైన వారందరికీ పథకాలను వర్తింపజేసిన ఘనత జగన్‌కే దక్కుతుంది.

పేదల సంక్షేమమే సీఎం ధ్యేయం

- నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిశోర్‌రెడ్డి

పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ పాలన సాగిస్తున్నారు. గత పాలకులు టిడ్కో గృహాల మాటున వ్యాపారం చేయాలనే దుర్మార్గపు ఆలోచనలను జగనన్న తిప్పికొట్టారు. రూ. 600 కోట్ల విలువైన ఇళ్లను కేవలం రూ. 8వేల నామమాత్రపు ఫీజుతో పేదలందరికీ అందిస్తున్నారు. ఒక్క రూపాయితో పూర్తిస్థాయిలో నిర్మితమైన 20 గజాల ఇంటిని నిర్మించి ఇస్తున్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేని పచ్చ బ్యాచ్ జగనన్న కాలనీపై కోర్టుకు వెళ్లి అడ్డుకోవడం సిగ్గు చేటు. ఉచిత శిల్పా వాటర్ ప్లాంట్, సూపర్‌మార్కెట్, కేబుల్ ప్రసారాలతో పాటు ఆటస్థలాలను నెలకొల్పి జగనన్న నగర్ అభివృద్ధికి తోడ్పాటునందిస్తా.

పుట్టింటి సారెగా ఇల్లు

- రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్

'రాష్ట్రంలో అక్కచెల్లెమ్మలకు జగనన్న పుట్టింటి సారెగా అన్ని వసతులతో కూడిన ఉచిత గృహాన్ని నిర్మించి ఒక్క రూపాయికే ఇవ్వడం చాలా సంతోషించదగ్గ విషయం. టీడీపీ నాయకులు అరకొరగా నిర్మించిన గృహాలకు అత్యాధునిక వసతులు కల్పించి పేదలకు అందజేస్తున్నాం. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఎస్టీపీ (సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్), ప్రెజర్ ఫిల్టర్‌లతో ఉచిత రక్షిత మంచి నీటి సదుపాయాన్ని కల్పించడం కేవలం వైఎస్ జగన్‌హన్ రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుంది. ప్రతి పక్షాలు చేస్తున్న ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదు. రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలు అందరికీ చేరుతున్నాయి. నంద్యాల ఎస్సార్బీసీ జగనన్న నగర్‌లో సుమారుగా 4వేల టిడ్కో గృహాలు సిద్ధంగా ఉన్నాయని అధికారులు చెప్పినా వాటిలో కేవలం నివాసయోగ్యమైన 2 వేల గృహాలను మాత్రమే లబ్ధిదారులకు అందించడం మా చిత్తశుద్ధికి నిదర్శనం. చాలా ఏళ్లుగా అద్దె ఇళ్లలో అవస్థలు పడిన లబ్ధిదారులు ఇక నుంచి జగనన్న నగర్ గ్రేటెడ్ కమ్యూనిటీలో అన్ని వసతుల మధ్య జీవనం సాగించనున్నారు. ఐదు కోట్ల ఆంధ్రుల మనసులు గెలుచుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అడ్డుకోవడం ఎవరి తరం కాదు. ఎన్నికల్లో ప్రజాతీర్పు వైఎస్సార్‌సీపీ వైపే ఉంటుంది'.



లబ్ధిదారురాలికి నూతన వస్త్రాలు అందజేస్తున్న మంత్రులు



సీఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం



టిడ్కో గృహాల వద్ద లబ్ధిదారుల సందడి

బ్రహ్మోత్సవాలను విజయవంతం చేద్దాం

- శ్రీశైలం ఈఓ లవన్న



మాట్లాడుతున్న ఈఓ లవన్న

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థాన అధికార యంత్రాంగం సమన్వయంతో పని చేసి మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఈఓ లవన్న సూచించారు. ఫిబ్రవరి 11 నుంచి 21వ తేదీ వరకు 11 రోజుల పాటు నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవ ఏర్పాట్లుపై శనివారం దేవస్థానం పరిపాలన భవనంలో ఆయా విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. వైదిక సిబ్బంది, ఆలయ విభాగాధికారులు ఉత్సవాలలో జరిగే ఆయా కైంకర్యాలన్నీ ఎలాంటి లోటు లేకుండా సంప్రదాయ బద్ధంగా నిర్వహించాలని ఏఈఓ హరిదాసును ఆదేశించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ముందుగానే ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతి విభాగం కూడా ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. పాదయాత్రగా వచ్చే భక్తుల సౌకర్యార్థం నాగలూటి, పెచ్చెర్వు, భీమునికొలను, కైలాసద్వారం, సాక్షి గణపతి మొదలైన చోట్ల సౌకర్యాలు కల్పించాలన్నారు. శివదీక్షా భక్తులకు ప్రత్యేక క్యూలైన్, జ్యోతిర్ముడి సమర్పణకు చేయాల్సిన ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. భక్తులు సేద తీరేలా ఆరుబయలు ప్రదేశాల్లో పైప్‌పెండాల్స్, షామియానాలు, మొదలైన వాటిని ఏర్పాటు చేయాలన్నారు. క్యూ లైన్లలో దర్శనానికి వేచి ఉండే భక్తులకు మంచినీరు, అల్పాహారం పంపిణీ చేసేందుకు అన్నదాన విభాగం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం ఉన్న మూత్రశాలలు, మరుగుదొడ్లకు మరమ్మతులు చేయించి అన్నింటిని వినియోగంలోకి తేవాలని పారిశుద్ధ్య విభాగాన్ని ఆదేశించారు. వాహనాల పార్కింగ్, సామగ్రి భద్రపరుచు గదులు తదితర అంశాలపై ఇంజినీరింగ్, భద్రతా విభాగం ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. పాతాళగంగలో రక్షణ కంచె, మహిళలు దుస్తులు మార్చుకునే గదులు ఏర్పాటు చేయాలన్నారు. బందోబస్తు ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలను సర్కిల్ ఇన్స్‌స్పెక్టర్ దివాకర్‌రెడ్డి వివరించారు. సమావేశంలో తహసీల్దార్ రాజేంద్ర సింగ్, ఏసీ వెంకటేష్, ఈఈ రామకృష్ణ, ఉభయదేవాలయాల ప్రధానార్చకులు వీరన్న స్వామి, మార్కండేయశాస్త్రి, పర్యవేక్షకులు మధుసూదన్‌రెడ్డి, స్వాములు, రవికుమార్, వెంకటేశ్వర్లు, టి.శ్రీనివాసరావు, శ్రీశైలప్రభ సంపాదకులు అనిల్‌కుమార్, డీఈ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పింఛన్ వారోత్సవాలు

కర్నూలు(అగ్రికల్చర్): పింఛన్ వారోత్సవాలు ఈ నెల 1వ తేదీన మొదలై శనివారంతో ముగిశాయి. వారోత్సవాల్లో పెంచిన పింఛన్‌తో పాటు నూతన లబ్ధిదారులకు పింఛన్ అందజేశారు. అన్ని మండలాలు, మున్సిపాలిటీల్లో ఉత్సవాలు పెద్ద ఎత్తున జరిగాయి. కర్నూలు జిల్లాలో 2,43,573 లబ్ధిదారులు ఉండగా శనివారం సాయంత్రం 6 గంటల సమయానికి 2,38,841 మందికి, నంద్యాల జిల్లాలో 2,19,244 మందికి గాను 2,16,793 మందికి పింఛన్లు అందజేశారు. శనివారం వరకే పింఛన్ల పంపిణీకి అవకాశం ఉండగా, ఇంకా కొంతమంది తీసుకోవాల్సి ఉండడంతో 9వ తేదీ వరకు పొడిగించినట్లు డీఆర్‌డీఏ, వైకేపీ పీడీ వెంకటసుబ్బయ్య తెలిపారు.

నంద్యాలలో మరో పాజిటివ్ కేసు

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలో ఐదు రోజుల క్రితం ఓ గర్భిణి కరోనా బారిన పడగా శనివారం మరో పాజిటివ్ కేసు నమోదైంది. కరోనా లక్షణాలతో బాధపడుతున్న ఓ వ్యక్తికి పరీక్షలు నిర్వహించగా పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో వైద్యాధికారులు హోం ఐసోలేషన్‌కు అనుమతించారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

సాంఘిక నాటకాలతో ప్రజల్లో చైతన్యం

- ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి



నాటక రచయిత పల్లేటి లక్ష్మీ కులశేఖర్‌కు పురస్కారాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా

నంద్యాల(వ్యవసాయం): సాంఘిక నాటకాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకు రావచ్చని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. అజో విభో కందాలం అమెరికా ఫౌండేషన్, నంద్యాల కళారాధన సాంస్కృతిక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ టౌన్‌హాల్‌లో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి సాహితీ నాటకోత్సవాలకు ఎమ్మెల్యే శిల్పారవి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాలలో రాష్ట్రస్థాయి సాహితీ సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. టౌన్‌హాల్‌ను మరింత ఆధునీకరించి తరచూ చక్కటి సాంస్కృతిక కళా సాహితీ కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి అనువుగా రూపొందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ప్రముఖ నాటక రచయిత కడపకు చెందిన పల్లేటి లక్ష్మీ కులశేఖర్‌కు విశిష్ట సాహితీ మూర్తి జీవిత కాల సాధన పురస్కారం అందజేస్తూ రూ.50 వేలు నగదు బహుమతిని అందజేశారు. అదే విధంగా ప్రముఖ తబల వాయిద్య కళాకారుడు సుంకన్నకు రంగ స్థల సేవా మూర్తి జీవిత కాల పురస్కారం, రూ.10 వేలు నగదు బహుమతిని అందజేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు అప్పా జోషుల సత్యనారాయణ మాట్లాడుతూ తెలుగు భాషా వికాసానికి తెలుగు సంస్కృతి, కళలను ప్రోత్సహించడానికి తమ ఫౌండేషన్ గత 30 సంవత్సరాలుగా నిర్వహిస్తున్నామని, భవిష్యత్‌లో కూడా ఈ కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తామన్నారు. భాస్కర చంద్ర రచించిన థ్యాంక్స్ ఫర్ ద పీఎం, గోపరాజు విజయదర్శకత్వంలో ప్రేమతో నాన్న.. నాటికలు ఆద్యంతం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డాక్టర్ మధుసూదనరావు, డాక్టర్ రవి కృష్ణ, డాక్టర్ మల్లికార్జునరెడ్డి, అనంత పద్మనాభరావు, చంద్రశేఖర్‌రెడ్డి, గోపాలకృష్ణ శాస్త్రి, సాయి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మిగనూరులో మహా రథోత్సవం



పూజలందుకుంటున్న శ్రీ నీలకంఠేశ్వరస్వామి

ఎమ్మిగనూరు: శ్రీ నీలకంఠేశ్వరస్వామి మహారథోత్సవం ఎమ్మిగనూరు పట్టణంలో ఆదివారం సాయంత్రం 5 గంటలకు జరగనుంది. ఈ ఉత్సవంలో పాల్గొనేందుకు జిల్లా నలుమూలల నుంచే గాక కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు విశేషంగా తరలి రానున్నారు. ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి, మాజీ ఎంపీలు బుట్టారేణుక, కోట్ల జయ సూర్యప్రకాష్‌రెడ్డి, మేజిస్ట్రేట్ గురు అరవింద్, ఆదోని ఆర్డీవో, డీఎస్పీలు ఉత్సవాల్లో పాల్గొంటున్నట్లు దేవదాయశాఖ అధికారులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం ఎమ్మిగనూరు పట్టణంలో ప్రభావళి ఉత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ం రాత్రి 10.30 గంటలకు ప్రభోత్సవం నిర్వహించారు. ప్రభపై ఉత్సవమూర్తులను శ్రీ నీలకంఠేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం నుంచి తేరుబజారు వరకు ఊరేగించారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్

నంద్యాల(అర్బన్): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 12వ తేదీన నిర్వహించే మెగా జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ సూచించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్ మేళాకు చెందిన వాల్ పోస్టర్లను ప్లేస్‌మెంట్ ఆఫీసర్ అన్సర్ అహమ్మద్, డీఎస్‌డీఓ ప్రతాపరెడ్డితో కలిసి కలెక్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జాబ్ మేళా నిర్వహిస్తుందన్నారు.

ఆర్‌యూ సూపరింటెండెంట్ సస్పెన్షన్

● ప్రొఫెసర్‌కు షోకాజ్ నోటీసులు

కర్నూలు(సిటీ): రాయలసీమ యూనివర్సిటీలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఎం.డి.ఇస్మాయిల్‌ను సస్పెండ్ చేశారు. ఇటీవల ఇస్మాయిల్ ఆర్‌యూకు చెందిన ప్రొఫెసర్ శ్రీనివాసరావుతో ఫోన్‌లో సంభాషిస్తున్న సమయంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురించి తీవ్రమైన పరుష పదజాలంతో దూషించారు. అదేవిధంగా యూనివర్సిటీలో స్వీపర్ నుంచి ఉపకులపతి వరకు పనిచేస్తున్న ఒకే సామాజిక వర్గం ఉద్యోగులను సభ్యసమాజం తలదించుకునేలా మాట్లాడారు. ఇందుకు సంబంధించిన ఆడియోలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేయడంతో కొందరు వ్యక్తులు చేసిన ఫిర్యాదు మేరకు ఎం.డి.ఇస్మాయిల్‌పై తాలూకా పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. ఇదే విషయంపై శనివారం సాయంత్రం వర్సిటీ స్టాండింగ్ కమిటీ ఫర్ అకడమిక్ సెనెట్ సభ్యులు సమావేశమై.. విచారణ పూర్తయ్యే వరకు ఇస్మాయిల్‌ను సస్పెండ్ చేసి, ఆయనతో ఫోన్ సంభాషణ కొనసాగించిన ప్రొఫెసర్ శ్రీనివాసరావుకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని తీర్మానం చేశారు.

'ఫ్యామిలీ ఫిజీషియన్'తో ఇంటి వద్దకే వైద్యం



మాట్లాడుతున్న కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

● కర్నూలు ఎంపీ సంజీవ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంతో ఇంటి వద్దనే ప్రజలకు వైద్యం అందుతోందని కర్నూలు పార్లమెంటు సభ్యులు డాక్టర్ ఎస్. సంజీవకుమార్ చెప్పారు. కర్నూలు మెడికల్ కాలేజిలో శనివారం నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో ఐదు సూపర్‌స్పెషాలిటీ విభాగాలకు పీజీ సీట్లు తీసుకొచ్చానని గుర్తు చేశారు. తాను పార్లమెంటులో ప్రస్తావించిన పలు బిల్లుల గురించి ఆయన వివరించారు. సమ్మేళనంలో తన స్నేహితులతో పాటు గురువులు కూడా ఉన్నారని చెప్పారు. నిరంతర వైద్యవిజ్ఞాన సదస్సుల ద్వారా వైద్య విద్యార్థులకు టీచింగ్ స్కిల్స్, స్పీకింగ్ స్కిల్స్ మెరుగుపడతాయన్నారు. ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ బి. సాంబశివారెడ్డి మాట్లాడుతూ దేశంలోని ప్రముఖ కళాశాలల్లో కర్నూలు మెడికల్ కాలేజి నాల్గవదన్నారు. ఇక్కడ చదివిన వారు దేశ, విదేశాల్లో పేరొందిన వైద్యులుగా సేవలందిస్తున్నారన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్ మాట్లాడుతూ 1956లో 50 సీట్లతో ప్రారంభమైన కళాశాల ప్రస్తుతం 250 సీట్లకు చేరిందన్నారు. ప్రస్తుతం 50 మంది ప్రొఫెసర్లు, 55 అసోసియేట్ ప్రొఫెసర్లు, 205 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 400 మంది పీజీలు ఉన్నారని తెలిపారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి. నరేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఆసుపత్రిలోని పాతభవనాలు కూల్చివేసి కొత్తగా ఐపీ భవనం నిర్మాణం కాబోతోందన్నారు. పాత గైనిక్ విభాగం స్థానంలో ఓపీ బ్లాక్, ఎమర్జెన్సీ బ్లాక్ రానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ నరసింహులు, డాక్టర్ మునీరుద్దీన్, ఏపీ మెడికల్ కౌన్సిల్ ఈసీ మెంబర్ రమేష్, సీనియర్ వైద్యులు డాక్టర్ విక్రమసింహారెడ్డి, డాక్టర్ జి. సుధాకర్, డాక్టర్ ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు జాతీయ ఆధునిక నృత్య పోటీలు

కర్నూలు కల్చరల్: ఎస్వీ సుబ్బారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కర్నూలులోని శ్రీలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో జాతీయ స్థాయి ఆధునిక నృత్య పోటీలు నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ శనివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

పాములపాడు: ఇస్కాల గ్రామంలో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన చాకలి లింగస్వామి కుమారుడు మహేష్ (18) ఇంటర్ పూర్తి చేశాడు. శనివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని మృతి చెందాడు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. కుమారుడి మృతితో తల్లి దండ్రులు బోరున విలపిస్తున్నారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎస్‌ఏ-1 ప్రశ్నపత్రం లీకేజీ ప్రచారంపై ఫిర్యాదు

కర్నూలు సిటీ: జిల్లాలోని అన్ని యాజమాన్యాలకు చెందిన పాఠశాలల్లో ప్రస్తుతం సమ్మెటివ్ అసెస్‌మెంట్-1 పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షల ప్రశ్నపత్రం జిల్లాలో లీకైనట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతుండటంపై డీఈఓ డాక్టర్ వి.రంగారెడ్డి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శనివారం డీఈఓ ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో ఎస్‌ఏ-1 పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని, కానీ కొందరు పేపర్ లీకేజీ జరిగినట్లు సోషల్ మీడియా ద్వారా అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారన్నారు. దీనిపై పోలీసులకు చేసిన ఫిర్యాదు మేరకు విచారణ జరుగుతోందన్నారు. విచారణలో నిజమని తెలితే బాధ్యులపై క్రిమినల్ కేసులతో పాటు, శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు.

రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలకు నేడు ఎంపిక

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఆదివారం ఉదయం 10 గంటలకు జిల్లా స్థాయి శాప్ లీగ్ కుస్తీ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సీఈఓ రమణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అండర్-17 బాలుర విభాగంలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో క్రీడాకారులు తప్పనిసరిగా తమ పేర్లను శాప్ లీగ్ యాప్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 11, 12 తేదీల్లో అనంతపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న 2వ రాష్ట్ర స్థాయి శాప్ లీగ్స్ కుస్తీ పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. వివరాలకు జిల్లా కుస్తీ సంఘం కార్యదర్శి అబ్రహం లింకన్ 8099804318 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ముగిసిన క్రీడా పోటీలు


విజేతలతో కాలేజీ అధ్యాపకులు

నంద్యాల(సిటీ): పట్టణంలోని ఈఎస్‌సీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం ఇంటర్ జిల్లా స్థాయి క్రీడా పోటీలు ముగిశాయి. షటిల్ సింగల్స్, వాలీబాల్, కబడ్డీలో ఈఎస్‌సీ ప్రభుత్వ కళాశాల జట్టు విజేతగా నిలిచింది. టేబుల్ టెన్నిస్ సింగిల్స్, డబుల్స్‌లో కేవీ సుబ్బారెడ్డి కళాశాల విద్యార్థులు గెలుపొందారు. విజేతలకు ఈఎస్‌సీ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస ప్రసాద్, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకుడు ఎంఎస్‌వీ రాజు బహుమతులను అందజేశారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ఫిబ్రవరిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.